● ఫిబ్రవరి ఒకటి నుంచి

రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడు

నగరంలో ఆస్తి విలువలు పెంచేసిన ప్రభుత్వం

- భారీగా పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు
- జనవరి ఒకటి నుంచి అమలుకు ప్రభుత్వం గతంలో నిర్ణయం..!
- వ్యతిరేకత రావడంతో ఫిబ్రవరి 1 నుంచి అమలుకు వాయిదా
- పెరిగిన స్టాంపు డ్యూటీ, ఫీజులతో నగరవాసుల ఆందోళన
- ఇప్పటికే మందగించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో మరింత కుదేలయ్యే ప్రమాదం
- కూటమి ప్రభుత్వం తీరుపై నగరవాసుల ఆగ్రహం

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో గల ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



సీతంపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా ఇటు సంక్షేమ పథకాలు, అటు అభివృద్ధి పనులు మచ్చుకైనా కానరాలేదు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ హడావిడి వేసి ప్రజలను మభ్యపెట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల ఊసే లేదు. పైగా విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో జనంపై ఆర్థిక భారం మోపారు. ఇది చాలదన్నట్టు నూతన సంవత్సరం కానుకగా స్థిరాస్తి విలువ అమాంతం పెంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పేరిట మరో మోతకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా అభివృద్ధి చెయ్యడానికి నిధులు కేటాయించడంతో విశాఖ నగర పరిధిలో స్థిరాస్తి క్రయ విక్రయాలు గత కొన్ని నెలలుగా మందగించాయి. జనవరి ఒకటో తేదీ నుంచి పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలు అమలు చేసేందుకు సిద్ధమై ధరలు కూడా నిర్ణయించేసిన ప్రభుత్వం... ప్రజల నుంచి వ్యతిరేకత, ఆగ్రహం పెల్లుబికడంతో వెనక్కు తగ్గినట్లు తెలుస్తోంది. కొత్త ఏడాదిలో ఫిబ్రవరి ఒకటి నుంచి పెంచిన చార్జీలు అమలు చేస్తామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించేశారు. ఫలితంగా ప్రభుత్వం తీరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత కుదేలవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అక్కయ్యపాలెంలో గల ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో పెరిగిన ఆస్తి విలువతో త్వరలో రిజిస్ట్రేషన్లు చెయ్యడానికి రంగం సిద్ధం చేశారు. ఈ లెక్కన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని అల్లిపురం, దొండపర్తి, కప్పరాడ, మాధవధార, మర్రిపాలెం గ్రామాల పరిధిలో చదరపు గజానికి రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు విలువ పెరగనుంది. ఈ లెక్కన రెసిడెన్షియల్, కమర్షియల్ ఇళ్లు, స్థలాలు, అపార్టుమెంట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం అదే స్థాయిలో పెరగనున్నాయి. కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు త్వరలో అమలు కానుండటంతో, పాత ధరలతో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి క్రయ, విక్రయదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బారులు తీరుతున్నారు.



ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని ప్రాంతాలను తెలిపే మ్యాప్

రెసిడెన్షియల్ చదరపు గజానికి పెరిగిన విలువలు

ప్రాంతం	పాత ధరలు	కొత్త ధరలు	పెరిగిన శాతం
అల్లిపురం	రూ.62 వేల నుంచి రూ.67 వేలు	రూ.66 వేల నుంచి రూ.75 వేలు	10% నుంచి 13%
దొండపర్తి	రూ.44 వేల నుంచి రూ.60 వేలు	రూ.50 వేల నుంచి రూ.66 వేలు	7% నుంచి 15%
కప్పరాడ	రూ.35 వేల నుంచి రూ.48 వేలు	రూ.40 వేల నుంచి రూ.55 వేలు	14% నుంచి 20%
మాధవధార	రూ.44 వేల నుంచి రూ.48 వేలు	రూ.48 వేల నుంచి రూ.55 వేలు	9% నుంచి 15శాతం
మర్రిపాలెం	రూ.16 వేల నుంచి రూ.48 వేలు	రూ.22 వేల నుంచి రూ.55 వేలు	9% నుంచి 18%

కమర్షియల్ చదరపు గజానికి పెరిగిన విలువలు

ప్రాంతం	పాత ధరలు	కొత్త ధరలు	పెరిగిన శాతం
అల్లిపురం	రూ.76 వేల నుంచి రూ.1.05 లక్ష	రూ.81 వేల నుంచి రూ.1.12 లక్ష	1% నుంచి 5%
దొండపర్తి	రూ.44 వేల నుంచి రూ.62 వేలు	రూ.50 వేల నుంచి రూ.70 వేలు	7% నుంచి 15%
కప్పరాడ	రూ.51 వేల నుంచి రూ.59 వేలు	రూ.56 వేల నుంచి రూ.66 వేలు	9% నుంచి 18%
మాధవధార	రూ.55 వేల నుంచి రూ.59 వేలు	రూ.63 వేల నుంచి రూ.67 వేలు	8% నుంచి 15శాతం
మర్రిపాలెం	రూ.51 వేల నుంచి రూ.64 వేలు	రూ.56 వేల నుంచి రూ.70 వేలు	9% నుంచి 18%

కొత్త ధరల ప్రకారం రిజిస్ట్రేషన్లు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త ఆస్తి విలువ ప్రకారం రిజిస్ట్రేషన్లు చెయ్యడానికి సిద్ధం చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెరిగిన ఆస్తి విలువలు రెసిడెన్షియల్, కమర్షియల్ వేర్వేరుగా ఆన్‌లైన్‌లో పొందుపర్చుతాం. పెరిగిన ధరల ప్రకారం ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ, ఫీజు చెల్లించాలి.

– డి.వి.నారాయణ, సబ్ రిజిస్ట్రార్, ద్వారకానగర్

రియల్ వ్యాపారం మందగించింది

గత ప్రభుత్వంలో విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటించడంతో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖలో గత కొద్ది నెలలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. ప్లాట్లు, సైట్లు కొనేవారు లేక వ్యాపారం డీలాపడింది. ఇపుడు పెంచిన ధరలతో వ్యాపారం మరింత పడిపోయే అవకాశం ఉంది. ధరల పెంపుపై ప్రభుత్వం పునరాలోచన చెయ్యాలి.

– డి.సాయి మోహన్, రియల్ ఎస్టేట్ వ్యాపారి

రైతుబజారు స్టాళ్లకు డ్రా



డ్రా తీసి టోకెన్ ఇస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో సోమవారం 63 స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం రైతుల కార్డులు 92 రాగా 63 స్టాళ్లకు డ్రా తీశారు. సాయంత్రం 63 స్టాళ్లకు 64 కార్డులు వచ్చినట్లు ఈవో కృష్ణమూర్తి తెలిపారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



అర్జీదారుల సమస్యలు వింటున్న జెడ్సీ రాము

కంచరపాలెం : జీవీఎంసీ జోన్ – 5 జ్ఞానాపురం కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో నలుగురు వినతులు అందించారు. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు వెంకటరమణ, రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్న రెడ్డి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవోలు పుణ్యవతి, కృపానంద, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లలితాపీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమం



లలితపీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట : స్థానిక శ్రీలలితాపీఠంలో అమావాస్య సందర్భంగా ఆదిపరాశక్తి అనుగ్రహం పొందేందుకు సోమవారం ఉదయం శ్రీఅథర్వణ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేద మంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితా పీఠంలో ప్రతి అమావాస్య రోజూ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శత్రు భయం, ఆర్థిక ఇబ్బందులు తొలిగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభ ఫలితాల కోసం ఆదిపరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు హోమం నిర్వహించినట్టు తెలిపారు.

కాలభైరవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

సీతమ్మధార : అమావాస్య సందర్భంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లోని దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా ఆలయంలో సోమవారం కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు చేశారు. భక్తులు నెయ్యి దీపాలు వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కాలభైరవ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్యామ్ బెనగళ్‌కు ఘన నివాళి



శ్యామ్ బెనగళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో దర్శకుడు శ్యామ్ బెనగళ్ సంస్మరణ సభ సోమవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కార్యదర్శి నరవ ప్రకాశరావు, కార్య నిర్వాహక కార్యదర్శి బి.చిన్నారావు తదితరులు బెనగళ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యజిత్ రే తర్వాత సినిమాల ద్వారా జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని శ్యామ్ బెనగళ్ సాధించారన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా పనిచేసి ఫిల్మ్ సొసైటీస్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సమావేశంలో హుస్సేన్, చాట్ల బాబూరావు, హేమ, గాయత్రి, సుబ్బారావు, శ్యామల పాల్గొన్నారు.

1న యంగ్ టాలెంట్ షో

సీతంపేట : యువతలో నైపుణ్యాలు వెలికి తీయడానికి యంగ్ టాలెంట్ షోలు దోహదపడతాయని రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి అన్నారు. ధనుంజయ్ టీం ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో జనవరి 1న సాయంత్రం నిర్వహించనున్న యంగ్ టాలెంట్ షో ట్రోఫీ సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధనుంజయ్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఆడిషన్స్‌లో 40 మందిని ఎంపిక చేశామని, డ్యాన్స్, సింగింగ్, మార్షల్ ఆర్ట్స్, క్లాసికల్ డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్, స్టాండప్ కామెడీ, ఫ్యాషన్ షో ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

కుటుంబం చెంతకు దివ్యాంగురాలు



జయపు వరలక్ష్మిని సోదరుడికి అప్పగించిన ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: మనస్తాపంతో ఇంటి నుంచి వచ్చేసిన దివ్యాంగురాలిని ఏయూటీడీ కార్యదర్శి సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కన్న తల్లే అవిటిదానివని పదే పదే అనడంతో తట్టుకోలేక జయపు వరలక్ష్మి (28) ఇటీవల వైజాగ్ వచ్చేసింది. రాజమండ్రి దివాన్ చెరువు ప్రాంతానికి చెందిన వరలక్ష్మికి పోలియో రావడంతో రెండు కాళ్లు ఒంకరపోయి నడవలేని స్థితికి చేరుకుంది. ఇంటి నుంచి వచ్చేసిన ఆమె రైల్వే స్టేషన్‌లో సంచరిస్తుండడంతో గమనించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఏయూటీడీ సిబ్బంది షెల్టర్‌కు తీసుకొచ్చి ఆశ్రయం ఇచ్చారు. ఈ క్రమంలో ఆ అమ్మాయి తండ్రి మీద ప్రేమతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేయడంతో సోదరుడు రాకేష్ రాజమండ్రి నుంచి విశాఖ వచ్చాడు. రాకేష్ జరిగినదంతా చెప్పడంతో వరలక్ష్మికి నచ్చజెప్పి క్షేమంగా రాజమండ్రి పంపించామని ఏయూటీడీ కార్యదర్శి వాసు తెలిపారు.

ప్రమాదాల నివారణతోనే స్థిరమైన ఉత్పత్తి



నేషనల్ సింపోజియం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బుద్ధ చంద్రశేఖర్, ఇతర ప్రముఖులు

మురళీనగర్ : కెమికల్, ఇతర కంపెనీల్లో ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకున్నప్పుడే స్థిరమైన ఉత్పత్తి సాధించగలమని అఖిల భారత విద్యాశాఖ మండలి, విద్య మంత్రిత్వ శాఖ ముఖ్య సమన్వయ అధికారి డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ అన్నారు. 'రసాయన – ఔషధ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ, సుస్థిర అభివృద్ధి' అనే అంశంపై కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ ఆధ్వర్యంలో కో – యూనివర్సిటీ, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ సౌజన్యంతో పరిశ్రమలు, విద్యాసంస్థలు, నియంత్రణ అధికారులతో జాతీయ స్థాయి చర్చా వేదిక సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైర్ అండ్ సేఫ్టీ విభాగం అధికారులు, సిబ్బందిపై గురుతర బాధ్యత ఉంటుందన్నారు. పరిశ్రమల రక్షణలో వీరు కీలక పాత్ర వహిస్తారని వివరించారు. సేఫ్టీ విభాగాల్లో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించడంతోపాటు సేఫ్టీ కోర్సులు పూర్తి చేయాలని సూచించారు. నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఐఐపీఈ ఫౌండర్ డైరెక్టర్ వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, సయాంక్ ఫార్మాస్యూటికల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జె.సుబ్బారావు, రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అధికార విభాగం చైర్మన్ బి. ఎస్. ఎస్ ప్రసాద్ (ఐ.ఎఫ్.ఎస్), జాయింట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్ రెడ్డి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ మండలి మాజీ చైర్మన్ పి.కృష్ణయ్య ఆన్‌లైన్‌లో పాల్గొని సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ కెమికల్ సేఫ్టీ కోర్స్ కో – ఆర్డినేటర్ ఎ.వరహాలు, కో – యూనివర్సిటీ డైరెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ యు.శ్రీదేవి పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌కు నగదు పురస్కారం



క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళికి చెక్ అందిస్తున్న సత్యనాథం, ద్వారకానాథ్

మురళీనగర్ : వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ప్రకటించే అరుదైన నగదు పురస్కారానికి మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఎంపికైంది. ఇటీవల ఏలూరులో నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ – 2024లో మురళీనగర్ వాకర్స్ క్లబ్ రెండు ప్రతిష్టాత్మక అవార్డులు సొంతం చేసుకుంది. ఉత్తమ సేవలు, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, రెగ్యులర్ వాకర్ విభాగాల్లో క్లబ్‌కు ప్రత్యేక పురస్కారంతో పాటు జ్ఞాపికను వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళికి అందించారు. దీంతోపాటు క్లబ్ నిర్వహించిన శాశ్వత ప్రాజెక్టులకు ప్రత్యేక గుర్తింపుగా రూ.30 వేల నగదు పురస్కారాన్ని ప్రకటించారు. ఈ మేరకు వాకర్స్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం, వాకర్స్ జిల్లా 101 గవర్నర్ (2025) కె.ద్వారకానాథ్‌లు క్లబ్ అధ్యక్షుడు చంద్రమౌళికి చెక్ అందించారు. కార్యక్రమంలో పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, కేజీ కృష్ణారావు, సంయుక్త కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు రోణంకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో వెలసిన షిర్డీసాయి ధ్యాన మందిరంలో 2025 సంవత్సరం క్యాలెండర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ మేరకు ఆలయ నిర్వహణ కమిటీ కార్యదర్శి సనపల వరప్రసాద్, ఇతర కమిటీ సభ్యులు క్యాలెండర్ ఆవిష్కరించి సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గోపి పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రాకపోకలకు ఇబ్బందులు



బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో మలుపు తిరగలేక రోడ్డు మీద నిలిచిపోయిన భారీ వాహనం

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోకి పట్టపగలే భారీ వాహనాలు రావడంతో సోమవారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో రాత్రి, పగలు తేడా లేకుండా భవన నిర్మాణ యాజమానులు పనులు చేపడుతుండడంతో ఇక్కడకు మెటీరియల్ తీసుకొచ్చే భారీ వాహనాలు రోడ్ల పైనే తిష్ట వేస్తున్నాయి. దీంతో స్థానిక వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలోకి పట్టపగలే భారీ వాహనాలు వస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడి మూడు రోడ్ల జంక్షన్ మలుపు వద్దనే భారీ వాహనం యూ టర్న్ కాకపోవడంతో వాహన చోదకులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇక్కట్లు పడాల్సి వస్తోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రాత్రి పూట నిర్మాణ పనుల్లో భాగంగా వచ్చే పెద్ద పెద్ద శబ్దాల కారణంగా నిద్రాభంగం కలుగుతోందని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఈస్ట్ గేటు, సీతమ్మధార కూడలి నుంచి వచ్చే వాహనాల రాకపోకలు ఈ రోడ్డు మీదుగానే జరుగుతాయి. దీంతో నిత్యం ఈ జంక్షన్ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ ఏదైనా ప్రమాదం జరగకముందే ద్వారకా పట్టణ ట్రాఫిక్ పోలీసులు స్పందించి భారీ వాహనాలు రోడ్డు మీద నిలపకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

పోక్సో చట్టంపై మహిళా కళాశాలలో వెబినార్



వెబినార్‌లో పాల్గొన్న లావణ్య, హైమావతి, జ్యోతిక, రోహిత తదితరులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డబ్ల్యూఈసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'స్టాప్ చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్–పోక్సో యాక్ట్ 2012' పేరిట సోమవారం వెబినార్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ వైశాలి రమేష్ విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ సామాజిక విషయాలపై అవగాహనతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ కేఎల్ శిరీష, ఎస్.అనురాధ, డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ బి.హైమావతి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం సంక్షేమ సంఘం ప్రతినిధులు

సీతంపేట : ముస్లింలకు ఖబరిస్తాన్, ప్రార్థనా స్థలాలు, షాదీఖానాలు ఏర్పాటు చేయాలని నూర్ భాషా ముస్లిం సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సీతంపేటలో గల జనసేన నగర కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యేను కలిసి సమస్యలు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ముస్లింలకు శ్మశానవాటిక, రంజాన్, బక్రీద్ పర్వదినాల్లో ప్రార్థనలకు స్థలం, కల్యాణాలు చేసుకునేందుకు షాదీఖానాలు ఏర్పాటు చేయాలని కోరారు. వక్ఫ్‌బోర్డు, మైనార్టీ కార్పొరేషన్, వెల్ఫేర్ ఆఫీసులకు కలెక్టరేట్ కార్యాలయంలో స్థలం కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు. ఉర్దూ పాఠశాలల అభివృద్ధి, పోటీ పరీక్షలకు శిక్షణ కేంద్రాలు, ముస్లింలకు కేటాయించిన వంద కోట్ల నిధులు విడుదల చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు షేక్ నాగూర్, షేక్ రెహమాన్, షేక్ బృహన్, షేక్ బాబ్జి పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలు నియంత్రించాలి

మహారాణిపేట: జిల్లాలో మాతృ,శిశు మరణాలు లేకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. సోమవారం రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతృ,శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. చంద్రానగర్, బాలాజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రెండు మాతృ మరణాలు సంభవించాయన్నారు. పెదగంట్యాడ, కొంట్యాం, రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మూడు శిశుమరణాలు సంభవించాయన్నారు. భవిష్యత్తులో ఎటువంటి మాతృ,శిశు మరణాలు సంభవించకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఉషాప్రసాద్, గిరిధర్, షర్మిలాకుమారి, శ్రావణ్, ప్రవీణ్, జి.రాజేష్, ఉమావతి, అప్పారావు, ఎన్‌వీ సమత, త్రినాథరావు, 108 డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఐ.మనోరమ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌కు సత్కారం



రమణమ్మను సన్మానిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్ నర్సింగ్ విభాగంలో గ్రేడ్ – 2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి సోమవారం రిటైర్ అయిన ఆర్.హెచ్.వి.రమణమ్మను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ సన్మానించారు. కేజీహెచ్ నర్సింగ్ విభాగంలో ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగాభవానీ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎస్.అప్పారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ పద్మావతి, ఆర్ఎంవో డాక్టర్ రాజేష్, అసోసియేషన్ అధ్యక్షురాలు గంగా భవానీ, ప్రధాన కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఎం.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని హెల్త్ అసిస్టెంట్ల ధర్నా



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో వివిధ తప్పుల వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, న్యాయం చేసి తమను ఆదుకోవాలని జిల్లా హెల్త్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ జీవో ప్రకారం 2002లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఎంపీహెచ్ఏ) ఉద్యోగాల్లో చేరామని, జిల్లాలో ప్రస్తుతం 148 మంది పనిచేస్తున్నారని, ఇటీవల తమను ఉద్యోగాల నుంచి తొలగించారని అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ అన్నారు. పోస్టుల రోస్టర్ కూడా సక్రమంగా చూపించలేదని, 148 మంది ఉంటే, వీరికి ఆర్‌వోఆర్ రోస్టర్ సక్రమంగా వేయలేదని, దీని వల్ల ఎంతో మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.